క్లుప్తంగా

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వాల్యూటెయిన్‌మెంట్' అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 20, పచ్చిమిర్చి 50, బెండ 50, కాకర 50, దొండ 35, దోస 50, ఆలు 20, చామ 70, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 15, క్యారెట్ 20, చిక్కుడు 65, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3) 10 , క్యాలీఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 140, వెల్లుల్లి 100.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: ఓల్డ్ ముంబాయి రోడ్డు ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శేరిలింగంపల్లిలోని జాతీయ రహదారిపై బీహెచ్ఇఎల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చందానగర్ మెయిన్ రోడ్డు, బీహెచ్ఇఎల్ ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబాయి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరిన యువకులతో బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ డివిజన్‌లో పలువురు యువకులు శనివారం బీజేపీలో చేరారు. బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాదవ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ నాయక్, శ్రీను, మనోహర్, వంశీ, నరేష్, రాజు, అక్షయ్, సాయి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



గచ్చిబౌలి: భారత ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు బీజేపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లాయి. శనివారం బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలారు. కార్యక్రమంలో పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కన్వీనర్ రాఘవేంద్రరావు, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి, వినోద్‌రావు, రమేష్, లక్ష్మణ్, నర్సింహ యాదవ్, పద్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థినికి ఆహ్వానం



మృణంద భట్టాచార్య

రాయదుర్గం: జర్మనీలో 72వ లిండావ్ నోబెల్ గ్రహీత సమావేశానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థినికి ఆహ్వానమందింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ చివరి సంవత్సరం ఐఎంఎస్‌సీ విద్యార్థి మృణంద భట్టాచార్యకు ఫిజియాలజీ, మెడిసిన్ రంగంపై నిర్వహించనున్న సదస్సుకు ఆహ్వానించారు. నోబెల్ గ్రహీతలు, సైన్స్ మార్గదర్శకులతో సంభాషించడానికి యువ పరిశోధకులకు ఇది ఒక గొప్ప అవకాశం.

హెచ్‌సీయూ వైట్‌రాక్స్‌లో 'క్లీనప్ డ్రైవ్'



రాయదుర్గం: గచ్చిబౌలి సెంట్రల్ యూనివర్సిటీలోని 'వైట్‌రాక్స్' ప్రాంతంలో శనివారం స్టూడెంట్స్ ఫర్ 'సేవ' సంస్థ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షురాలు నమ్రతాసింగ్, నిర్వాహకులు తులసీరామ్, సంగమేష్, స్నేహ మాట్లాడుతూ సెలవు రోజుల్లో క్యాంపస్‌లో విద్యార్థులు ఎక్కువగా సేద తీరే ప్రాంతాలను ఎంపిక చేసి కార్యక్రమాలను చేపడతామన్నారు.



రూపురేఖలు మారిన మాదాపూర్ దుర్గంచెరువు



సుందర తటాకాలుగా..

- వెస్ట్‌జోన్ పరిధిలో 17 చెరువుల సుందరీకరణ
- ముందుకొచ్చిన నిర్మాణ సంస్థలు

గచ్చిబౌలి: చెరువులకు ఇక మహర్దశ పట్టనుంది. నగరంలో సుందరీకరించాలని తలపెట్టిన చెరువులలో శేరిలింగంపల్లి ప్రాంతంలోనే ఎక్కువగా ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 25 చెరువులను సుందరీకరించేందుకు దత్తత ఇచ్చే వాటిలో 17 చెరువులు శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలోనివే కావడం విశేషం. గచ్చిబౌలి డివిజన్‌లో ఏడు చెరువులు, శేరిలింగంపల్లిలో రెండు, హఫీజ్‌పేట్‌లో రెండు, మాదాపూర్‌లో మూడు, పటాన్‌చెరులో రెండు, చందానగర్ డివిజన్‌లో ఒక చెరువు ఉంది. ఇటీవల మున్సిపల్ మంత్రి కేటీ రామారావు ఖాజాగూడ చెరువు సుందరీకరణ పనులను ప్రారంభించి తదనంతరం నిర్మాణ సంస్థలకు కేటాయించిన చెరువులపై ఒప్పందం చేసుకున్నారు.

- సుందరీకరించనున్న 51 చెరువుల్లో జీహెచ్‌ఎంసీలో 26, హెచ్‌ఎండీఏలో 25 ఉన్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో పనులు చేపట్టాలని కేటీఆర్ ఆయా నిర్మాణ సంస్థలకు సూచించారు.-చెరువుల పరిధిలోని ఎఫ్‌టీఎల్‌లో పట్టాలు ఉంటే న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలని ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్‌ను మంత్రి కేటీఆర్ ఆదేశించడంతో ఆయా స్థలాల యజమానులతో మాట్లాడి క్లియరెన్స్ వచ్చాకనే నిర్మాణ సంస్థలకు సుందరీకరణకు అనుమతిస్తారు.
- ప్రతి చెరువు చుట్టూరా ఫెన్సింగ్, చిల్డ్రన్ పార్కు అభివృద్ధి
- ఆకట్టుకునేలా గ్రీనరీ, లైటింగ్, ఓపెన్‌జిమ్, యోగా చేసేందుకు ఏర్పాటు
- వాకింగ్ ట్రాక్‌లు, టాయిలెట్లు ,బెంచీల ఏర్పాట్లు
- స్థలం ఉంటే కాన్సెప్ట్ థీమ్ పార్కులూ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశం.

శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో నిర్మాణ సంస్థలకు అప్పగించిన చెరువులు

చెరువు పేరు	ప్రాంతం	డివిజన్	నిర్మాణ సంస్థ
చిన్నపెద్దచెరువు	గోపన్‌పల్లి	గచ్చిబౌలి డివిజన్	హానర్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్
ఎల్లమ్మచెరువు	ఖాజాగూడ	గచ్చిబౌలి డివిజన్	నిహారిక ప్రాజెక్టు
భగీరథమ్మచెరువు	నానక్‌రాంగూడ	గచ్చిబౌలి డివిజన్	మీనాక్షి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్
మేడికుంట	నానక్‌రాంగూడ	గచ్చిబౌలి డివిజన్	టీఎస్ఐఐసీ
రంగ్‌లాల్‌కుంట	నానక్‌రాంగూడ	గచ్చిబౌలి డివిజన్	యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్
మెట్లకుంట	గోపన్‌పల్లి	గచ్చిబౌలి డివిజన్	వెర్టెక్స్‌వెగా డెవలపర్స్ ఎల్‌ఎల్‌పి
ఖాజాగూడ లేక్	ఖాజాగూడ	గచ్చిబౌలి డివిజన్	దివ్యశ్రీఎన్ఎస్ఎల్ ఇన్‌ఫ్రా, మిడస్ సంస్థ
గోపిచెరువు	లింగంపల్లి	శేరిలింగంపల్లి డివిజన్	అరబిందో సంస్థ
కొత్తకుంట	శేరిలింగంపల్లి	శేరిలింగంపల్లి డివిజన్	యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్
రామసముద్రం	మదీనాగూడ	హఫీజ్‌పేట్ డివిజన్	వెర్టెక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్
ఈర్లచెరువు	మదీనాగూడ	హఫీజ్‌పేట్ డివిజన్	ఇండిస్ స్మార్ట్ హౌజింగ్ ప్రైవేట్ లిమిటెడ్
మొండికుంట	మాదాపూర్	మాదాపూర్ డివిజన్	వాసవి హౌసింగ్ సంస్థ
కొత్తచెరువు	నోవాటెల్	మాదాపూర్ డివిజన్	హైటెక్స్ లిమిటెడ్
గుట్టల బేగంపేట్ లేక్	గుట్టలబేగంపేట్	మాదాపూర్ డివిజన్	అయ్యన్న ఫౌండేషన్
గంగారంచెరువు	చందానగర్	చందానగర్‌డివిజన్	శ్రావణి వెంచర్స్ అండ్ అవెన్యూస్
సాకిచెరువు	పటాన్‌చెరు	పటాన్‌చెరు డివిజన్	ఇన్‌కార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్
తిమ్మక్కచెరువు	పటాన్‌చెరు	పటాన్‌చెరు డివిజన్	ఏపీఆర్ ప్రాజెక్ట్స్





ఖాజాగూడలోని పెద్ద చెరువు మ్యాప్

దశలవారీగా అభివృద్ధి



శేరిలింగంపల్లి చెరువులను అభివృద్ధి చేస్తాం. రెండింటిని సీఎస్ఆర్ నిధులతో సుందరీకరించాం. తాజాగా నగరంలో 25 చెరువులను సుందరీకరించాలని ప్రభుత్వం నిర్మాణ సంస్థలకు కేటాయించగా అందులో సగం మా పరిధిలోవే కావడం విశేషం. పార్కుల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు లేకపోవడంతో చెరువులను సుందరీకరించి ఆహ్లాదకరంగా మార్చే అవకాశం కలిగింది. నిర్మాణ సంస్థలు స్వచ్ఛందంగా ముందుకురావడం హర్షణీయం.

– ఎమ్మెల్యే గాంధీ, శేరిలింగంపల్లి

పారిశుద్ధ్యంపై అలసత్వం వద్దు

అల్విన్‌కాలనీ: వివేకానందనగర్, హైదర్‌నగర్, అల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్‌లలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై శనివారం ఏఎంఓహెచ్ డాక్టర్ మమత, జీహెచ్‌యంసి శానిటేషన్ విభాగం అధికారులు, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు, ఎస్ఆర్‌పి, ఎస్ఎఫ్ఏలు, రాంకీ ప్రతినిధులతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులపై అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. అధికారుల మధ్య సమన్వయలోపంతో పారిశుద్ధ్య పనులు కుంటుపడటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కాలనీలు, బస్తీలలో, ప్రధాన రహదారిపై చెత్త కుప్పలు పేరుకుపోయాయని, రోగాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాల్గొన్నారు.

డోరా టెస్ట్ క్రికెట్ కప్ విజేత కాన్‌కరర్స్



సాక్షి, సిటీబ్యూరో: మియాపూర్‌లోని ఎస్ఎంఆర్ వినయ్ సిటీలో శనివారం జరిగిన డోరా టెస్ట్ సిరీస్ టోర్నమెంట్‌లో కాన్‌కరర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ప్రత్యర్థి రెబల్స్ జట్టుపై ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. మొదటి బ్యాటింగ్ చేసిన రెబల్స్ జట్టు నిర్ణీత 15 ఓవర్ల మ్యాచ్‌లో 9 వికెట్లు కోల్పోయి.. 115 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కాన్‌కరర్స్ జట్టు 14.2 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 117 పరుగుల్ని చేసి విజయం సాధించింది. బ్యాటింగ్ (39 రన్స్) , బౌలింగ్ (3 వికెట్లు)లో మెరుపులు మెరిపించిన సాకేత్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా వికాస్ వొహ్రా (82 రన్స్).. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా సాకేత్ నిలిచారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో యువతి ఆత్మహత్యాయత్నం

- పెళ్లికి ముందే కట్నం, బైక్ ఇవ్వాలని యువకుడి పరతు
- రెండో అంతస్తు నుంచి దూకిన యువతి
- పరిస్థితి విషమంగా ఉందన్న డాక్టర్లు

పటాన్‌చెరు టౌన్: కట్నం, బైక్ ముందే కావాలని, ఇస్తేగాని పెళ్లి చేసుకునేది లేదని ఓ యువకుడు ఫోన్‌లో యువతిని తిడుతూ అడగటంతో మనస్తాపం చెందిన యువతి రెండో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. యువతి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణంలోని నాయికోటి బస్తీకి చెందిన జంగయ్య కూతురు యామినికి పటాన్‌చెరు మండలం భానూర్ కంచర్ల గూడేనికి చెందిన జంగయ్య అక్క లక్ష్మి కుమారుడు చిన్నోల శంకర్‌తో మార్చి 26వ తేదీన నిశ్చితార్థం జరిగింది. ఆ సమయంలో రూ.50 లక్షలు కట్నం భూమి అమ్మిన తర్వాత ఇస్తామని చెప్పడంతో శంకర్ కుటుంబ సభ్యులు ఒప్పుకున్నారు. నిశ్చితార్థం జరిగిన మర్నాడే కట్నంతో పాటు బైక్ ముందే కావాలని యువతికి ఫోన్ చేసి అడిగాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు శుక్రవారం యువకుడి ఇంటికి వెళ్లి మాట్లాడేందుకు వెళ్లడంతో తనకు పెళ్లి అవసరం లేదంటూ నిశ్చితార్థం సమయంలో పెట్టిన రింగ్ తీసి పడేశాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు మళ్లీ మాట్లాడుదామని చెప్పి ఇంటికి వచ్చారు. దీంతో మనస్తాపం చెందిన యువతి భవనం రెండో అంతస్తు పైనుంచి దూకడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు వెంటనే యామినిని చికిత్స కోసం పట్టణంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కట్నకానుకల విషయంలో శంకర్, అతడి కుటుంబ సభ్యులు వేధించడం వల్లే తమ కూతురు ఆత్మహత్యకు యత్నించిందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్‌గా.. సైబర్ మోసం

- జాబ్ అవకాశమంటూ అపరిచితుడి మెసేజ్
- రెట్టింపు నగదు అంటూ బురిడీ
- రూ.1.33 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ యూట్యూబ్ వీడియోస్ లైక్ చేసే జాబ్ ఉందంటూ అపరిచితుడు పంపిన టెలిగ్రామ్ మెసేజ్‌కు స్పందించిన బాధితుడు పెద్ద మొత్తంలో నగదు పొగొట్టుకున్నాడు. ఈ ఘటన భానూర్-బీడీఎల్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామ సమీపంలోని లైఫ్‌స్టైల్ లో నివాసం ఉండే బ్యాంక్ ఉద్యోగి వంశీధర్‌రెడ్డికి గతనెల 19వ తేదీన ఆన్‌లైన్ యూట్యూబ్ లైక్స్ కొట్టే ఉద్యోగం ఉందని టెలిగ్రామ్‌లో మెసేజ్ వచ్చింది. ముందుగా బాధితుడు తన వివరాలను నమోదు చేయగా, ఆన్‌లైన్ ఇచ్చిన టాస్క్ చేయగా అతడికి రూ.150, రూ.800 ఇచ్చారు. అనంతరం క్రిప్టో కరెన్సీ అకౌంట్ క్రియేట్ చేసుకోమని చెప్పగా బాధితుడు అలాగే చేశాడు. దీంతో రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టుకోవచ్చని, పెట్టిన పెట్టుబడికి 30 శాతం కమీషన్ ఇస్తామని నమ్మబలికారు. ముందుగా రూ.7 వేలు పెట్టుబడి పెట్టగా రూ.9100 క్రియేట్ చేసిన అకౌంట్‌లో చూపించారు. తర్వాత రూ.30 వేలు వేయగా రూ.39 వేలు చూపించారు. ఇలా నగదు పెడుతూ పోగా రూ. 1.33 లక్షల వరకు బాధితుడు పెట్టాడు. పెట్టిన డబ్బు రావాలంటే రూ.3 లక్షలు ఇన్వెస్ట్ చేయాలని చెప్పడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించాడు. జరిగిన ఘటనపై సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశాడు. శనివారం బీడీఎల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని యువకుడు మృతి



సునీల్ (ఫైల్)

మియాపూర్: ప్రేమించిన అమ్మాయి తల్లిదండ్రులు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా, న్యాల్‌కల్ మండలం, మీర్జాపూర్ గ్రామానికి చెందిన రాములుకు ముగ్గురు కుమారులు. వీరు మియాపూర్‌లోని ఎంఏనగర్‌లో ఉంటున్నారు. తల్లిదండ్రులు స్వగ్రామంలో ఉంటున్నారు. చిన్న కుమారుడు మేకల సునీల్ (22) స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు.కాగా కొంతకాలంగా సునీల్ బంధువుల అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని అడగగా తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో శనివారం తెల్లవారుజామున గదిలో రాడుకు ఉరి వేసుకున్నాడు. ఉదయం సోదరుడు వచ్చి చూసే సరికి సునీల్ వేలాడుతూ కనిపించాడు, వెంటనే స్థానికుల సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుని సోదరుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మోహినీయట్టం



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వసంతోత్సవ నృత్యోత్సవాలలో భాగంగా శనివారం తపస్య నృత్య కళాకేంద్రం గురువు కళామండలం లక్ష్మీ అనిల్ శిష్యబృందం మోహినియట్టం నృత్యంతో అలరించారు. చోళకెట్టు, తిరువాతిర, జతిస్వరం, కీర్తనం, అష్టలక్ష్మి, పదం, కరుకారే కర్మకిల్లను కళాకారులు లక్ష్మీ అనిల్, లీల వాసుదేవన్, దేవి కృష్ణన్, మాధురి, అర్చన, దేవి నందన, ఆశ, సౌమ్య, సరిత, ఐశ్వర్య, అశ్విని, గిరిజలు ప్రదర్శించారు.

బీసీలను కించపరిచే వ్యాఖ్యలు తగదు

రాయదుర్గం: బీసీలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం తగదని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్‌ముదిరాజ్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బడుగువర్గాల నాయకుడు నీలం మధుపై చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఇలాంటివి పునరావృతం అయితే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. నాయకులు రమేష్, ప్రదీప్, కిరణ్, రాజు, కురుమూర్తి, నవీన్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కాంటినెంటల్‌లో రోబోటిక్ హార్ట్ సర్జరీ

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కాంటినెంటల్ ఆసుపత్రిలో హృద్రోగికి రోబో శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ విషయాన్ని రోబోటిక్ సర్జన్ డా.సుధీర్ ప్రేమ్ శ్రీవాస్తవ తెలిపారు. సగటు మనుషులకు కూడా రోబోటిక్ సర్జరీల వ్యయం అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో అభివృద్ధి చేసిన తమ ఎస్ఎస్ఐ మంత్ర రోబోటిక్ సిస్టమ్ ఇప్పటికే 130 శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించిందని, తాజాగా కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 35ఏళ్ల వయసున్న హృద్రోగి శస్త్ర చికత్స విజయవంతం అయిందన్నారు. ఈ విధానంలో సర్జరీ చేయించుకున్న రోగి కేవలం 2 రోజుల్లోనే పూర్తిగా కోలుకోగలడన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



రాయదుర్గంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి/రాయదుర్గం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రశాంత్‌హిల్స్‌లో పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శనివారం ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత్‌హిల్స్‌కాలనీలో నెలకొన్న అవుట్‌లెట్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. డ్రైనేజీ, రోడ్ల పునరుద్ధరణ, అసంపూర్తి రోడ్లను త్వరలో వేస్తామన్నారు. ప్రశాంత్‌హిల్స్‌లోని చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

రాయదుర్గంలో..

రాయదుర్గంలోని గోరెంకబస్తీలో ఎమ్మెల్యే గాంధీ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూజీడీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాగా వర్షాకాలం రోడ్ల మీద నీరు నిలబడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అలాగే డ్రైనేజీ, మంచినీరు, వీధిదీపాలు, విద్యుత్ తదితర సమస్యలను వివరించారు. అన్నింటిని దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్ ముదిరాజ్, సతీష్, శ్రీకాంత్, సత్యనారాయణ, వసీమ్, అశోక్, జగదీష్, అశోక్‌రెడ్డి, ప్రసాద్, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయం ప్రారంభం

గచ్చిబౌలిలోని టీఎస్ హౌసింగ్ బోర్డు కాలనీలో పునర్నిర్మించిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, కాలనీ అధ్యక్షులు నర్సింహారావు, సూర్యప్రకాశ్, శివశంకర్, ప్రసాద్, సత్యనారాయణ, ప్రకాశ్, నాగార్జున ,కాలనీవాసులు పాల్గొన్నారు.

సులువుగా విద్యా బోధన చేయాలి

- భారత ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ మాజీ సెక్రటరీ అనిల్ స్వరూప్
- ఇంటిగ్రేటెడ్ ప్రీస్కూల్ టీచర్స్ ట్రైనింగ్ అకాడమీ ఫెస్ట్



ఫెస్ట్‌ను తిలకిస్తున్న భారత ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ మాజీ సెక్రటరీ అనిల్ స్వరూప్

మాదాపూర్: వినూత్నమైన ఉపకరణాలతో విద్యాబోధన సులువుగా ఉంటుందని, పిల్లలు వెంటనే అర్థం చేసుకుంటారని భారత ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ మాజీ సెక్రటరీ అనిల్ స్వరూప్ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం ఇంటిగ్రేటెడ్ ప్రీస్కూల్ టీచర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐపీటీటీఏ) ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పాఠశాల విద్య ఎంతో అవసరమన్నారు. భారతదేశంలో ఆలోచనలకు కొరత లేదని వాటిని నిలదొక్కుకునేందుకు అనేక సవాళ్లను అధిగమించాలన్నారు. ఈ ప్రదర్శనలో 100కి పైగా వినూత్న బోధన సహాయ ఉపకరణాలు, 300 నమూనాలు ప్రదర్శనలో ఉంచారు. విద్యాబోధన ఉపకరణాలలో తోలుబొమ్మలు, ఇంటరాక్టివ్ పుస్తకాలు, మల్టీ సెన్సోరియల్ క్రియేటివ్ టెక్నిక్‌లు, లైవ్ కౌంటర్లు, టేక్ అవేలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్ నిపుణురాలు సుల్తానా మొయిద్, ఐపీటీటీఏ డైరెక్టర్ సోనాల్ ఆండ్రూస్‌తో పాటు వివిధ స్కూళ్ల ప్రిన్సిపల్స్, టీచర్లు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. గుడ్‌ఫ్రైడే పురస్కరించుకొని పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన రన్ ఫర్ జీసస్ ద్విచక్ర వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరి పట్ల ప్రేమ, అనురాగం ఆప్యాయతతో మెలగాలని క్రీస్తు తన బోధనల ద్వారా విశ్వవ్యాప్తంగా ప్రచారం చేశారన్నారు. నియోజకవర్గంలో నూతన చర్చిల నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.